పోలింగ్ ప్రశాంతం

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు


ఓటేసిన భార్గవి


కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద పోలింగ్ కేంద్రంలో క్యూ కట్టిన ఓటర్లు


నందానగర్ కృష్ణవేణి ట్యాలెంట్ స్కూల్‌లో క్యూలైన్లలో ఓటర్లు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 6,99,130 వేల ఓటర్లు ఉండగా వీరిలో 29 సంవత్సరాలలోపు సగం మంది ఉన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు ఉత్సాహంగా ఉదయమే క్యూ లైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభివృద్ధి మౌలిక వసతులు కల్పించే వ్యక్తికే ఓటు వేసే ప్రయత్నం చేస్తామని చెప్పుకొచ్చారు.

◆ జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అక్కడ విధులు నిర్వహించే పోలీసు సిబ్బందిలోనికి పంపే విషయంలో ఒకరికొకరు వాదోపవాదాలు చేసుకుంటూ వచ్చారు.

◆ బీఆర్‌ఎస్ అభ్యర్థి వివేకానంద, కాంగ్రెస్ అభ్యర్థి హన్మంతరెడ్డి, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ పలు ప్రాంతాల్లో ఓటింగ్ సరళిపై స్థానికంగా ఉన్న వారిని అడిగి తెలుసుకుంటూ ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద పర్యటించారు. వీరితోపాటు ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు సైతం పలు ప్రాంతాల్లో ఓటర్ల సరళిపై ఆరా తీశారు.

◆ అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద రిసోర్స్ పర్సన్‌లను సహాయకులుగా ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో ఎదురయ్యే ఇబ్బందులను అక్కడికక్కడే గుర్తించి వారికి ఓటు కల్పించే బాధ్యతను తీసుకున్నారు. ప్రత్యేకంగా వారికి టేబుల్స్ ఏర్పాటు చేసి ఓటర్లకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వీరు విధుల్లో పాల్గొన్నారు.

◆ నియోజకవర్గం పరిధిలో ఒకవైపు బాలానగర్ మరోవైపు మేడ్చల్ డీసీపీ పరిధిలో ఉండడంతో పలు ప్రాంతాల్లో డీసీపీలు శబరిష్, శ్రీనివాసరావు లో పర్యటించి అక్కడికక్కడే కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ ముందుకు సాగారు. ఇదే క్రమంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్‌రవీంద్ర, అడిషనల్ సీపీ అవినాష్ మహంతి పర్యటించారు.

◆ పోలింగ్ స్టేషన్లకు సుమారు 200 మీటర్ల దూరంలో ఆయా పార్టీల నాయకులకు ఓటింగ్ కోసం వచ్చే వారికి స్లిప్పులు అందించేందుకు అనుమతి ఇచ్చారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద స్లిప్‌ల పంపిణీ వద్ద ఓ పార్టీకి చెందిన నాయకులు ఓటర్లను ఆటోలలో ఎక్కించి పోలింగ్‌స్టేషన్‌కు పంపించారు. స్లిప్‌లు అందజేసి ఆటో ఎక్కించే సమయంలో గుర్తుందిగా మన గుర్తుకే ఓటేయ్యండంటూ చెప్పడం గమనార్హం.


వెన్నెలగడ్డలో దుకాణాలను మూసి వేయిస్తున్న డీసీపీ శబరీష్

కుత్బుల్లాపూర్‌లో ఓటింగ్ 56.72 %

గత ఎన్నికల కంటే కాస్త పెరిగిన ఓటింగ్ శాతం

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఈవీఎంలలో 3 లక్షల 69వేల 140 ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. 2018 ఎన్నికల సమయంలో మొత్తం 5,16,259 మంది ఓటర్లు ఉండగా 2 లక్షల 88 వేల 909 ఓట్లు నమోదు కాగా అప్పటి లెక్కల ప్రకారం 55.96 శాతం ఓటింగ్ నమోదైంది.

– తాజాగా 2023 లెక్కల ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 6,99,042 మంది ఓటర్లుగా ఉండగా గురువారం సాయంత్రం 5 గంటల వరకు 3,69,140 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 56.72 శాతం ఓటింగ్ జరిగింది. సాయంత్రం నుంచి క్యూలైన్లు పెరగడంతో 6 గంటల వరకు ఎంత మేరకు ఓటింగ్ జరిగిందన్న దానిపై రాత్రి 8 గంటల తరువాత ఓటింగ్‌పై ఎన్నికల అధికారులు స్పష్టత ఇవ్వనున్నారు. ఈ దఫా ఓటింగ్ శాతం కాస్త అటు ఇటుగా 60 శాతానికి చేరుకోవచ్చని ఎన్నికల విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సమయం	ఓటింగ్ శాతం
ఉదయం 9 గంటలకు	8.5 శాతం
ఉదయం 11 గంటలకు	14.2 శాతం
మధ్యాహ్నం ఒంటి గంటకు	28.7 శాతం
మధ్యాహ్నం 3గంటలకు	40.6 శాతం
సాయంత్రం 5 గంటలకు	56.72 శాతం

5గంటల తర్వాత పోలింగ్ బూత్‌లో ఓటర్లు ఉండడంతో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మొదటిసారి ఓటు


ఓటు హక్కు వినియోగించుకున్న మేఘనా, కీర్తనా


ఓటు వేసిన సాయిశ్రీ

ఓటేసిన వృద్ధులు


వీల్ చైర్‌పై ఓటు వేసేందుకు వచ్చిన మహిళకు సహకరిస్తున్న పోలీసులు


రంగారెడ్డినగర్ ఓటు హక్కును వినియోగించుకున్న ఓ వృద్ధురాలు

ఓటేసిన గృహిణులు




చంటి బిడ్డలతో వచ్చి ఓటు వేసిన గృహిణులు

పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో కృతజ్ఞతగా అధికారులకు లేఖ రాసి పోస్ట్ వేస్తున్న బాలయ్యనగర్ బస్తీ వాసులు



ఇదే మా మొదటి పోలింగ్‌బూత్

- 40 ఏళ్ల తర్వాత బస్తీలో పోలింగ్‌బూత్ ఏర్పాటు
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన బస్తీ ప్రజలు


మార్చి 10న అధికారులకు లేఖ రాసి పోస్ట్ వేస్తున్న బస్తీ వాసులు


సాక్షి
ఇదే మా మొదటి లేఖ..

సాక్షిలో ప్రచురితమైన కథనం

సుభాష్‌నగర్: ఒకప్పుడు కొండలు గుట్టలతో ఉన్న ఆ ప్రాంతం. అక్కడ నిత్యం రాళ్ల పట్టుకొని జీవనం కొనసాగించే వడ్డారులే. 1982లో గుడిసెలు వేసుకొని బాలయ్యనగర్‌గా బస్తీ ఏర్పాటు అయ్యింది. శరవేగంగా అభివృద్ధి చెందిన నగర విస్తరణలో కాలక్రమేన గుడిసెల స్థానంలో రేకుల ఇళ్లు, ప్రస్తుతం బహుళ అంతస్తులు భవనాలు పుట్టుకొచ్చాయి. స్థానికంగా వడ్డెర కులస్తులే కాకుండా అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ ఉండడంతో మినీ ఇండియాగా మారింది. ప్రస్తుతం 5 వేలకు పైగా జనాభా ఉన్న బాలయ్య నగర్‌లో అన్ని మౌలిక వసతులు ఉన్న పోలింగ్ కేంద్రం కల్పించలేదు. దీంతో స్థానిక ప్రజలు గాజుల రామారం విలేజ్ జడ్పీహెచ్‌ఎస్, మండల పరిషత్, చంద్రగిరినగర్‌లకు రెండు కిలోమీటర్ల మేర వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వచ్చేది.

'సాక్షి'చొరవతో..

బాలయ్య నగర్ లో మార్చ్ 10న నూతనంగా పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు అయింది. బస్తీ వాసులు అందరు ఏకమై స్థానికంగా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజాప్రతినిధులకు ఒక్కసారిగా పదుల సంఖ్యలో ఉత్తరాలు పంపించారు. ఈ విషయమై 'ఇదే మా మొదటి లేఖ'అనే శీర్షికతో సాక్షి మార్చ్ 11న ప్రచురితం చేసింది. దీంతో ఎన్నికల ప్రధాన అధికారి స్పందించారు. వెంటనే ఆ బస్తీకి అధికారుల బృందం వచ్చి బాలయ్యనగర్‌లో పర్యటించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో 250 పోలింగ్ బూత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యను సాక్షి చొరవతో ఉన్నతాధికారులు పరిష్కరించడంతో కృతజ్ఞతగా అధికారులకు బస్తీవాసులు ఉత్తరం వేస్తున్నట్లు బస్తీ ప్రెసిడెంట్ నాగేష్ తెలిపారు.


కేపీ వివేకానంద్


శ్రీశైలం గౌడ్


శంభీపూర్ రాజు

ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సజావుగా సాగాయి. నియోజకవర్గంలో ప్రజలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సత్‌జ్ఞాన్ స్కూల్‌లో, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ గాజులరామారంలోని తత్వ స్కూల్‌లో, బాచుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి, శంభీపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, స్వతంత్ర అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో పాటు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, పార్టీల నేతలు ఓటు వేశారు.

– దుండిగల్


కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంత్‌రెడ్డి


ఓటేసిన కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్


కుత్బుల్లాపూర్‌లో ఓటేసిన కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, భరతసింహారెడ్డి


కాంగ్రెస్ నేతలతో కలిసి ఓటు వేసిన నర్సారెడ్డి భూపతిరెడ్డి


సాయిబాబా నగర్‌లో తమ పార్టీకే ఓటు వేయాలని ఓటర్లను వేడుకుంటున్న ఓ పార్టీ కార్యకర్తలు


గాంధీనగర్‌లో ఓటర్లను ఆటోలో పోలింగ్ కేంద్రానికి పంపుతూ..

బాధ్యత గల పౌరుడు



రంగారెడ్డినగర్: ఓ వైపు వయోభారంతో బాధ పడుతున్నా బాధ్యతగల పౌరుడిగా రంగారెడ్డినగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డినగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్లా(74) గురువారం గాంధీనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేతికర్ర సహాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆయన పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని, అప్పుడే రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును సార్ధకత కలుగుతుందన్నారు. తాను ఎప్పుడు ఎన్నికలు జరిగినా తప్పకుండా ఓటు వేస్తానన్నారు. తనతో పాటు కుటుంబ సభ్యులు, ఇంటి చుట్టు పక్కల వారిని సైతం ఓటు వేయాలని సూచిస్తానని అబ్దుల్లా 'సాక్షి'తో తెలిపారు.

నా ఓటు ఎవరో వేశారు..


ఆవేదన వ్యక్తం చేస్తున్న భాస్కరరావు

సుభాష్‌నగర్: ఆ వ్యక్తి లైన్ లో నిలబడి ఓటు వేసేందుకు లోపలికి వెళ్లగా ×మీ ఓటు అప్పటికే వేశారు అని సిబ్బంది చెప్పడంతో సదరు ఓటరు కంగుతిన్నాడు. గాజుల రామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్‌కు చెందిన అన్నెపు భాస్కరరావు తమ ఓటు వేయడానికి ఉదయం 10:30 గంటలకు గాజులరామారం జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలోని 263 పోలింగ్ బూత్‌కు వచ్చాడు. ఓటు వేసేందుకు లోనికి వెళ్లగా అతని నెంబర్ చూడగా అప్పటికి మీ ఓటు వేశారని సిబ్బంది తెలిపారు. దీంతో భాస్కరరావు సిబ్బందిని నిలదీయడంతో అతనికి నచ్చజెప్పి పంపించి వేశారు.

ఓటు వేసిన పెళ్లి కొడుకు


ప్రొఫెసర్ కోలా అరవింద్

సుభాష్‌నగర్: ఆ ఇంట ఓవైపు పెళ్లి తంతు జరుగుతుండగా పెళ్లి కుమారుడు వేషధారణలో వచ్చి లైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నాడు. సూరారం వెంకట్రాంనగర్ చెందిన కోలా అరవింద్ (పీహెచ్‌డీ) దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం అతని పెళ్లి ఉండగా, గురువారం ఉదయం నుండి ఇంట్లో పెళ్లి శుభకార్యాలు జరుగుతున్నాయి. ఆ ప్రొఫెసర్ కాసేపు శుభకార్యాలను పక్కనపెట్టి ఓటు కోసం సమయం కేటాయించాడు. వెంకట్ రామ్‌నగర్‌లోని నార్త్‌సిటీ హైస్కూల్‌లో ఓటు వేశారు. పెళ్లి కుమారుడి వేషధారణలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడంపై పలువురు ప్రశంస జల్లులు కురిపించారు.



ఓటేసిన నిండు గర్భిణి

సుభాష్‌నగర్: సూరారం మల్లారెడ్డి ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ పద్మావతి నిండు గర్భిణీ. అయినప్పటికీ సూరారం వెంకటరామ్‌నగర్‌లోని నార్త్‌సిటీ హైస్కూల్‌లో గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నారు.

స్కూటీపై వెళ్లి ఓటేస్తా..

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ వినూత్నంగా స్కూటీపై వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. గాజులరామారం గ్రామ సమీపంలోని తత్వా స్కూల్‌లో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నాడు. శ్రీశైలంగౌడ్ స్కూటీపై రావడంతో అక్కడ ఉన్న ఓటర్లు అందరూ ఆసక్తిగా చూస్తూ కనిపించారు.


ఓటు వేసేందుకు స్కూటీపై వెళ్తున్న కూన శ్రీశైలంగౌడ్

పల్లెబాట.. ఓటు వేస్తా


సుచిత్ర 44వ జాతీయ రహదారిలో సొంతూళ్లల్లో ఓటు వేసేందుకు బస్సు కోసం వేచి ఉన్న ఓటర్లు

సుభాష్‌నగర్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కొంతమంది ఓటర్లు తమ సొంత ఊళ్లకు ప్రయాణమయ్యారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ వారి ఓట్లు సొంత ఊళ్లల్లో ఉండడంతో ఓటు వినియోగించడానికి బుధవారం నుంచి తరలివెళ్లారు. కొంతమంది గురువారం తెల్లవారుజాము నుంచి సంతూళ్లల్లో ఓటు వేసేందుకు పయనమయ్యారు. దీంతో 44వ జాతీయ రహదారి సుచిత్ర, కొంపల్లి, నర్సాపూర్ రహదారిలోని చింతల్, షాపూర్‌నగర్, సూరారం, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, జగద్గిరిగుట్ట బస్టాప్ లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

వైన్స్ తెరుచుకోకముందే బారులు


షాపూర్‌నగర్‌లో..

సుభాష్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో గత రెండు రోజుల నుంచి మద్యం షాపులు బంద్ ఉండగా గురువారం సాయంత్రం ఎన్నికల అనంతరం తెరుచుకున్నాయి. కానీ సాయంత్రం నుంచే మద్యం దుకాణాల ముందు మందుబాబులు బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో 6.30 గంటలకు మద్యం దుకాణాలు తెరుకున్నాయి. కొన్నిచోట్ల 7గంటల వరకు తెరుచుకోకపోవడంతో షాపుల ముందు మందు బాబులు కిక్కిరిసిపోయారు.

144 సెక్షన్ మచ్చుకైనా కనిపించలే..


గాంధీనగర్ పోచమ్మ ఆలయం సమీపంలో స్లిప్పుల పంపిణీ వద్ద గుమిగూడిన జనం

రంగారెడ్డినగర్: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ఐదుగురికి మించి గుమిగూడితే వారిపై కఠిన చర్యలు తప్పని పోలీస్ ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయితే రంగారెడ్డినగర్ డివిజన్‌లో 144 సెక్షన్ ఛాయలు మచ్చుకైనా కనిపించలేదు. ఠాగూర్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా సమీపంలోని 500 మీటర్ల లోపు ఉన్న పోచమ్మ గుడి వద్ద ఓటర్లకు స్లిప్ల పంపిణీ చేపట్టారు. అయితే ఆయా పార్టీలకు చెందిన వారు స్లిప్పు ఓటర్లకు అందజేస్తుండగా సమీపంలో కొందరు వ్యక్తులు గుమిగూడి ఓటర్లను ప్రభావితం చేయడానికి యత్నించారు.

ఓటింగ్ సరళి పరిశీలన


జీడిమెట్లలో ఎన్నికల బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ పోలింగ్ సరళి బందోబస్తు ఏర్పాట్ల విషయంపై గురువారం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ సీపీ అవినాష్ మహంతిలు మేడ్చల్, బాలానగర్ డీసీపీల పరిధిలో పర్యటించారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో సీపీ పర్యటించగా, మేడ్చల్ డివిజన్ పరిధిలో మహంతి పర్యటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా పోలింగ్ స్టేషన్లో వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పారదర్శకంగా, సామరస్యపూర్వకంగా అన్ని పార్టీల నాయకులు ఓటింగ్ విషయంపై సహకరించాలని కోరారు. ఎక్కడైనా కావాలని అల్లర్లు జరిగితే మాత్రం ఊరుకునే సమస్య లేదని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీపీ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు. వారి వెంట డీసీపీలు శబరీష్, శ్రీనివాస్‌రావు ఇతర సిబ్బంది ఉన్నారు.